andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
కామారెడ్డి
జిల్లా వార్తలు



కలెక్టరేట్‌లో మహిళ హల్‌చల్

- సర్వే సెటిల్‌మెంట్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్‌గా చెప్పుకున్న మహిళ
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వద్ద రిపోర్టు చేసేందుకు వచ్చిన మహిళ
- విచారించి ఆర్డర్ కాపీ నకిలీదని నిర్ధారించిన అధికారులు
- పోలీసులకు ఫిర్యాదు... కేసు నమోదు

కామారెడ్డి టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సర్వే సెటిల్‌మెంట్ ల్యాండ్ రికార్డ్స్ కమిషనర్‌గా రాష్ట్ర గవర్నర్ తనను నియమించారంటూ ఓ మహిళ కామారెడ్డి కలెక్టరేట్‌లో హల్‌చల్ చేసింది. స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ మధుమోహన్ వద్దకు వచ్చి కమిషనర్‌గా నియామకం అయ్యానంటు చెప్పడంతో ఆర్డర్ కాపీ, ఇతర సర్టిఫికెట్లపై విచారించగా నకిలీవని తేలడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. సదరు మహిళపై దేవునిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్‌కు చెందిన ఇస్రాత్ జహాన్ అనే మహిళ తన తండ్రి, కుటుంబీకులతో కలిసి మంగళవారం మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో కామారెడ్డి కలెక్టరేట్‌కు వచ్చారు. కలెక్టరేట్‌లోని స్థానిక సంస్థల ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ మధుమోహన్ చాంబర్‌కు వెళ్లి ఐఏఎస్ క్యాడర్‌లో సర్వేసెటిల్‌మెంట్, ల్యాండ్ రికార్డు కమిషనర్‌గా నియామకం అయ్యానని వివరించింది. ప్రస్తుత కలెక్టర్ ఆశీష్‌సాంగ్వాన్‌ను బాధ్యతల నుంచి తప్పించి కమిషనర్‌తో పాటు అదనపు కలెక్టర్ బాధ్యతలు తాను స్వీకరిస్తానని చెప్పుకొచ్చింది. అయితే అదనపు కలెక్టర్ మధుమోహన్ సదరు మహిళను మీకు వచ్చిన ఆర్డర్ కాపీని చూపమని సూచించారు. ఆర్డర్ కాపీ తన వద్ద లేదని వాట్సాప్‌లో తెప్పించి చూపించింది. జిల్లా స్థాయిలో సర్వే సెటిల్‌మెంట్, ల్యాండ్ రికార్డు కమిషనర్ పోస్టు లేకపోవడంతో అదనపు కలెక్టర్‌కు అనుమానం వచ్చి జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్‌గా ఉన్న వినయ్‌కృష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఇన్‌చార్జ్ కలెక్టర్ సదరు మహిళ ఇచ్చిన ఆర్డర్ కాపీలపై జీఏడీలో విచారించి అవి ఫేక్ ఆర్డర్ కాపీలని నిర్ధారించారు. దీంతో అదనపు కలెక్టర్ వెంటనే దేవునిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పటికే ఫేక్ ఆర్డర్ కాపీ, సర్టిఫికెట్లతో వచ్చిన జహాన్ రాత్రి కావడంతో హైదరాబాద్‌కు వెళ్లేందుకు ప్రయత్నించింది. అయితే అధికారులు సదరు మహిళకు ఫోన్ చేసి జాయినింగ్ కావాలని మీకు అన్ని వసతులు కల్పించామంటూ నమ్మ బలికించారు. రెండు రోజుల తర్వాత వచ్చి జాయిన్ అవుతానని చెప్పడంతో సదరు మహిళ ఫోన్‌ట్రాప్ చేసి తుప్రాన్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయంపై దేవునిపల్లి ఎస్సై రంజిత్‌ను బుధవారం వివరణ కోరగా అదనపు కలెక్టర్ ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బస్సు ఎక్కే వరకు ముక్కు మూయాల్సిందే..

- చౌరస్తాలో ప్రయాణ ప్రాంగణం కరువు
- సర్వీస్ రోడ్డులో భారీ గుంతలు
- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

8




కామారెడ్డిలో..


దోమకొండలో..

కమనీయం..
దీప వైభవం!

- జిల్లాలో ఘనంగా కార్తీక పౌర్ణమి వేడుకలు
- శివాలయాల్లో ప్రత్యేక దీపారాధన కార్యక్రమాలు
- ఆలయాల్లో సామూహిక సత్యనారాయణ వ్రతాలు
- దీపోత్సవ కార్యక్రమాలతో పలు ఆలయాల్లో భక్తుల సందడి

కామారెడ్డి టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): హర హర మహాదేవ శంభోశంకరా... అంటు భక్తులు తెల్లవారు జాము నుంచే ఆలయాలకు చేరుకొని కార్తీక పౌర్ణమి వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే తలంటు స్నానాలు ఆచరించి ఆలయాల్లో దీపోత్సవ కార్యక్రమాలను నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. తులసి గద్దెలను అలంకరించి పుష్పాలతో పూజలు నిర్వహించారు. మరికొంత మంది ఆలయాల్లో సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలోని ఓంకారేశ్వరాలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించి భక్తులకు అన్నప్రసాద కార్యక్రమం చేపట్టారు. సాయంత్రం స్వామి వారి పల్లకి సేవ నిర్వహించారు. విద్యానగర్ సాయిబాబా దేవాలయంలో భక్తుల సమక్షంలో ఆకాశదీపం విజయవంతంగా వెలిగించారు. తులసిమాత వివాహ మహోత్సవ కార్యక్రమాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీకృష్ణ ధ్యాన మందిరంలో శ్రీకృష్ణునికి అభిషేకాలు, హారతి నిర్వహించారు. కార్తిక పౌర్ణమి విశిష్టతను గాంధారికర్ బాబా వివరించారు. ఈ విఠలేశ్వరుని ఆలయంలో భక్తులు పెద్ద ఎత్తున పూజ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. హౌజింగ్ బోర్డులోని సంకష్టహర గణపతి ఆలయంలో, విద్యానగర్‌లోని శివాలయం, గోపాల స్వామి రోడ్డులో గోపాల స్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక దీపాలను వెలిగించి పూజలు చేశారు. వివేకానంద కాలనీలోని హనుమాన్ ఆలయం, శ్రీరాంనగర్ కాలనీ, అశోక్‌నగర్ కాలనీ, ఎన్‌జీవోస్ కాలనీలోని సీతారామాంజనేయ ఆలయాల్లో మహిళలు ప్రత్యేక దీపాలంకరణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయాల సమీపంలోని రాగి చెట్టు కింద వత్తులను వెలిగించారు.

శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంలో..

భిక్కనూరు: మండల కేంద్రంలోని దక్షిణకాశీగా బాసిల్లుతున్న శ్రీ సిద్ధరామేశ్వర ఆలయంలో కార్తీక పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని స్వామి వారికి ఆలయ అర్చకులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని తీరొక్క పూలతో అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఉదయం నుంచే భక్తులు జిల్లా నలుమూలల నుంచే కాకుండా మెదక్, సిద్దిపేట, నిజామాబాద్ నుంచి భక్తులు పెద్దఎత్తున చేరుకుని స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులు సామూహిక సత్యనారాయణ వ్రతాలు, స్వామివారి కల్యాణం, కోడెల పూజలను ఆలయ అర్చకుల వేద మంత్రోచ్చరణల నడుమ ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు భక్తులకు ఆలయ అర్చకులు తీర్థప్రసాదాల వితరణ చేశారు. సాయంత్రం నుంచి ఆలయ ప్రాంగణంలో భక్తులు కార్తీక దీపాలను వెలిగించారు. ఈ మేరకు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ప్రతినిధులు, సిబ్బంది ప్రత్యేక జాగ్రత్తలు తీసుకున్నారు.


సిద్ధరామేశ్వర ఆలయంలో..


బాన్సువాడ కల్కి చెరువులో చేపపిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పోచారం

మత్స్యకారులు అభివృద్ధి చెందాలి

- రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి

బాన్సువాడ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మత్స్యకారులు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం పట్టణంలోని కల్కి చెరువులో చేప పిల్లలను నాయకులు, అధికారులతో కలిసి విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 100 శాతం సబ్సిడీపై చేప పిల్లలను ఉచితంగా అందజేస్తుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలోనే ఈ పథకం కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం ప్రజల అవసరాలకు దగ్గట్టుగా పనులు చేస్తూ పోతోందని, సేవా సంస్థగా పని చేస్తోందన్నారు. మత్స్యకారులు చేపలను దళారులకు అమ్మి మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విక్టర్, జిల్లా మత్స్యశాఖాధికారి శ్రీపతి, సొసైటీ చైర్మన్ ఏర్వల కృష్ణారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, నార్ల సురేశ్, నార్ల రవీందర్, గోపాల్‌రెడ్డి, సాయిలు, ఏజాస్, అఫ్రోజ్ తదితరులున్నారు.

ఉబికివస్తున్న..
పాతాళగంగ


మహ్మద్‌నగర్‌లో పుష్కలంగా పోస్తున్న బోరు

- భారీ వర్షాలకు పెరిగిన నీటి మట్టాలు
- ప్రస్తుతం జిల్లాలో 5.42 మీటర్ల లోతులోనే నీరు
- జిల్లాలో గత రెండు నెలలుగా కురుస్తూనే ఉన్న వర్షాలు
- సాధారణం కంటే 58 శాతం అధిక వర్షపాతం నమోదు
- యాసంగి సాగుకు ఢోకా లేనట్టే..

కామారెడ్డి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో భారీగా కురిసిన వర్షాలతో భూగర్భజలాల మట్టాలు గణనీయంగా పెరిగాయి. జూలైలో సగటు భూగర్భ జల మట్టం 12.90 మీటర్ల లోతులో ఉండగా ఆగస్టులో 8.87 మీటర్లకు చేరింది. సెప్టెంబరులో 5.93, అక్టోబరులో 5.42 మీటర్ల లోతులో భూగర్భజలాలు ఉన్నాయని సంబంధిత శాఖ రికార్డులు చెబుతున్నాయి. కాగా గత ఏడాది ఇదే సమయంలో భూగర్భజలాల మట్టం 8.62 మీటర్లుగా ఉంది. అంటే గత ఏడాది కన్న ఈ సంవత్సరం 3.19 మీటర్లు ఎక్కువగా పెరిగింది. జిల్లాలో ఆగస్టు నుంచి అక్టోబరు వరకు భారీ వర్షాలు కురువడంతో వాగులు, చెరువులు, కుంటలు నిండి ఆయా ప్రాంతాల్లో భూగర్భ జలాల మట్టాలు ఉబికి వచ్చాయి. భూగర్భజలాలు పెరగడంతో రెండేళ్ల పాటు నీటికి ఢోకా ఉండదని సంబంధిత శాఖ అధికారులు భావిస్తున్నారు. ఇక వచ్చే రెండు సీజన్‌ల పంటల సాగుకు పుష్కలంగా సాగునీరు అందే అవకాశం ఉంది.

6 మండలాల్లో 3 మీటర్లలోతులోనే..

జిల్లాలో 6 మండలాల పరిధిలో 3 మీటర్ల లోతులోనే భూగర్భజలాల నీటి మట్టం ఉంది. లింగంపేటలో అతి తక్కువ లోతులో 0.18 మీటర్లలోనే భూగర్భజలాలు ఉన్నాయి. మహమ్మద్‌నగర్‌లో 1.88 మీటర్లలో నస్రూళ్లాబాద్‌లో 2.2 మీటర్లలో పల్వంచలో 2.4, జుక్కల్‌లో 2.05, మద్నూర్‌లో 2.49, బాన్సువాడలో 2.99 మీటర్లలోతులోనే ఉన్నాయి. కానీ తాడ్వాయి మండలం కన్కల్‌లో మాత్రం భూగర్భజలాలు వృద్ధి చెందలేదు. ఇక్కడ 19.88 మీటర్లలోతులో నీరు ఉంది.

వానలు దంచి కొట్టడంతో..

జిల్లాలో గత మూడు నెలలుగా వానలు దంచికొట్టడంతో భూగర్భజలాలు పెరిగినట్లు తెలుస్తోంది. ఇప్పటికీ వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఆగస్టు చివరలో కురిసిన భారీ వర్షాలతో నిజాంసాగర్, పోచారం, కౌలాస్‌నాలా ప్రాజెక్టులన్నీ పొంగి ప్రవహించాయి. గతంలో ఎన్నడూ లేనివిధంగా వరదల తాకిడితో గేట్లన్నీ ఎత్తి నీటిని దిగువకు వదిలారు. అన్ని చెరువులు, కుంటలు నిండాయి. జిల్లాలో ఇప్పటి వరకు సాధారణ వర్షపాతం 885.5 మి.మీలు కాగా 1402.7 మి.మీల వర్షపాతం నమోదైంది. అంటే సాధారణం కన్న 58.4 శాతం అదనంగా వర్షం కురిసింది. సుమారు రెండు నెలలుగా వానలు పడుతుండడంతో వాగులు, వంకలు ప్రవహిస్తూనే ఉన్నాయి. దీంతో (మిగతా 8లో..)

శిథిలావస్థలో ఉన్న పాఠశాల గదుల కూల్చివేత

దోమకొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): దోమకొండ మండలంలోని పలుగడ్డ ఉన్నత పాఠశాల ఆవరణలో శిథిలావస్థలో ఉన్న గదులను బుధవారం కూల్చివేశారు. కూల్చివేత పనులను మాజీ జడ్పీటీసీ తిరుమల్ గౌడ్ పరిశీలించి ఎప్పటి నుంచో ఇబ్బందికరంగా ఉన్న గదుల వల్ల విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రిన్సిపాల్ జస్వంత్‌రావు ప్రత్యేక చొరవ తీసుకొని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడం అభినందనీయమని తెలిపారు. డీఈవో రాజుతో పాటు ఉన్నతాధికారులకు విద్యార్థుల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అశోక్..
ఆవిష్కరణలకు కేరాఫ్

- లివర్ క్యాన్సర్ నివారణలో నానో కంపోసిట్‌లపై పరిశోధన
- రెండు దేశాల్లో పేటెంట్స్ సాధించిన హాసాకొత్తూర్ వాసి

6

44వ జాతీయ రహదారిపై లారీ దగ్ధం

- లారీలో కెమికల్ డబ్బాలు
- రోడ్డుపై ఇరువైపుల భారీగా ట్రాఫిక్ జాం
- మంటలు ఆర్పిన ఫైర్ ఇంజన్లు


సిద్ధరామేశ్వరనగర్ వద్ద దగ్ధమవుతున్న లారీ


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

భిక్కనూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కెమికల్ డబ్బాలతో వెళ్తున్న లారీలో ఒక్కసారిగా మంటలు చెలరేగి క్యాబిన్ మొత్తం మంటలకు ఆహుతైనా సంఘటన భిక్కనూరు మండలంలోని సిద్ధరామేశ్వరనగర్ గ్రామ సమీపంలో 44వ జాతీయ రహదారిపై బుధవారం రాత్రి చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే రాజస్థాన్ నుంచి రాజమండ్రికి కెమికల్ డబ్బాలతో కంటైనర్ లారీ(నెం.హెచ్‌ఆర్ 47 డీ 1932)తో డ్రైవర్ షరీఫ్ వెళ్తున్నాడు. లారీ సిద్ధరామేశ్వర నగర్ గ్రామ సమీపానికి చేరుకోగానే క్యాబిన్‌లో మంటలు మొదలయ్యాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్ లారీని రోడ్డుపై వదిలేసి కిందకు దూకి వెనుకాల వస్తున్న వాహనాలను ఆపి పరిస్థితిని వివరించాడు. కెమికల్ డబ్బాలు ఉండటంతో ఎలాంటి ప్రమాదమైన జరగవచ్చునన్న ఉద్దేశ్యంతో వాహనదారులు రోడ్డుకు ఇరువైపుల మండుతున్న లారీకి దూరంగా వాహనాలను నిలుపుకుని పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే ప్రమాద స్థలికి భిక్కనూరు సీఐ సంపత్, ఎస్సై ఆంజనేయులు చేరుకుని కామారెడ్డి, మెదక్ జిల్లా రామాయంపేట ఫైర్‌స్టేషన్‌లకు సమాచారం అందజేశారు. వెంటనే అక్కడికి ఫైర్‌ఇంజన్లు చేరుకోగా సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. కాగా ఈ ప్రమాదంతో రోడ్డుకు ఇరువైపుల కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోగా ఫైర్ ఇంజన్ మంటలను ఆర్పుతుండగా పోలీసులు ఒక వైపు నుంచి వాహనాలను ఒక్కొక్కటిగా పంపిస్తూ ట్రాఫిక్ జాంను పునరుద్ధరించారు. దాదాపుగా అరగంటకు పైగా వాహనాలు ఇరువైపుల నిలిచిపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సందర్భంగా కంటైనర్ లారీ డ్రైవర్ షరీఫ్ మాట్లాడుతూ లారీ క్యాబిన్‌లో ఒక్కసారిగా మంటలు రాగా వెంటనే లారీ దూకి ఇతర వాహనాలు లారీ వద్దకు వెళ్లకుండా స్థానికుల సహాయంతో అప్రమత్తం చేశానన్నారు. లారీలో కెమికల్ డబ్బాలు ఉండటంతో ఏమైనా ప్రమాదం జరిగితే చాలా ఇబ్బంది ఉండేదని పోలీసులు, ఫైర్ సిబ్బంది చేరుకుని మంటలను అదుపు చేయడంతో ప్రమాదం తప్పిందని వివరించాడు.


లారీలోని కెమికల్ డబ్బాలు


భిక్కనూరులో ధాన్యాన్ని పరిశీలిస్తున్న డీసీవో రామ్మోహన్

కొనుగోలు కేంద్రాల్లో వసతులు కల్పించాలి

- డీసీవో రామ్మోహన్

భిక్కనూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు మౌలిక వసతులు కల్పించాలని డీసీవో రామ్మోహన్ సిబ్బందికి సూచించారు. బుధవారం భిక్కనూరు మండల కేంద్రంతో పాటుగా బస్వాపూర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని, రికార్డులను పరిశీలించారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ అకాల వర్షాల నేపథ్యంలో ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలని, కొనుగోలు కేంద్రాల్లో రైతులకు కావాల్సిన వసతులను కల్పించాలన్నారు. వర్షాలు కురుస్తున్నందున ధాన్యం కుప్పలపైనా రైతులు టార్పాలిన్‌లు, కవర్లు కప్పుకోవాలన్నారు. సిబ్బంది ట్యాబ్ ఎంట్రీని త్వరగా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విండో చైర్మన్ గంగల భూమయ్య, క్లస్టర్ అధికారి రమేష్, ఆయా విండోల సీఈవోలు రాజు, మహేశ్వరీ, సిబ్బంది రవికిరణ్ పాల్గొన్నారు.


పోచంపాడ్ గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు


మెండోరాలో స్వామివారికి పల్లకీ సేవను నిర్వహిస్తున్న దృశ్యం


ఉప్లూర్‌లోని శ్రీ బాలరాజరాజేశ్వర స్వామి ఆలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

కార్తీకం.. కమనీయం

కార్తీక పౌర్ణమి సందర్భంగా జిల్లావ్యాప్తంగా శైవక్షేత్రాలు కిటకిటలాడాయి. భక్తులు తెల్లవారుజాము నుంచే గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి, ఆలయాలకు తరలివెళ్లారు. ఆయా ఆలయాల ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అర్చకుల ఆధ్వర్యంలో తులసిపూజలు, సత్యనారాయణ వ్రతాలు, అభిషేకాలతో దైవ దర్శనం పొందారు. కార్తీక మాసం పవిత్రమైనదని, ఉపవాసం. దానం, అర్చనలు చేస్తే విశేష ఫలాలు సిద్ధిస్తాయని భక్తుల నమ్మకం.

\- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


కేదారేశ్వర ఆశ్రమం వద్ద జాతరలో పాల్గొన్న భక్తులు


యంచ విఠలేశ్వర ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న శ్రీ ఓం ఆదిశక్తి ఆలయ వ్యవస్థాపకురాలు స్వర్ణకమల లక్ష్మి

నందిపేట, నవంబరు 5: నందిపేట మండల కేంద్రానికి అతి సమీపంలో ఉన్న శ్రీ కేదారేశ్వర ఆశ్రమం భక్తుల శివనామ స్మరణంతో మారుమోగింది. విజయదశమి సందర్భంగా దీక్ష చేపట్టిన ఆశ్రమ వ్యవస్థాపకులు మంగిరాములు మహరాజ్ మంగళవారం కార్తీకపౌర్ణమి రోజున అర్ధరాత్రి దీక్ష విరమించారు. కాగా బుధవారం జాతర ఉత్సవాలు జరిగాయి. మంగిరాములు మహరాజ్ ఆశీస్సుల కోసం భక్తులు తెల్లవారు జామునుంచే బారులు తీరారు. వేలాదిగా తరలివచ్చిన భక్తులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. క్యూలో ఉన్న భక్తులకు నేరుగా ఒక్కొక్కరికి మహరాజే విబూది పెట్టి ఆశీర్వదించారు. కట్న, కానుకలు సమర్పించుకున్నారు. జిల్లా నలు మూలల నుంచే కాకుండా ఆదిలాబాద్, కరీంనగర్, మెదక్, హైదరాబాద్, మహబూబ్‌నగర్, వరంగల్, నల్గొండ జిల్లాల నుంచి భక్తులు తరలివచ్చారు. మహరాష్ట్ర, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుంచి సైతం భక్తులు రెండు, మూడు రోజుల ముందే వచ్చి తిష్టవేశారు. ఆలూర్, బాద్గుణ, మారంపల్లి గ్రామాల నుంచి వచ్చిన భజన కారులు భక్తులకు కనువిందు చేశారు. మండలంలోని విద్యార్థులు, యువజన, రైతు సంఘాల సభ్యులు, వ్యాపారులు వాలంటీర్లుగా పనిచేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. సుమారు 50వేలకు పైగా భక్తులు పాల్గొన్నారు. ఎస్‌ఐ శ్యామ్‌రాజ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.


మహరాజ్‌కు అవార్డ్ అందిస్తున్న దృశ్యం

మహరాజ్‌కు గోల్డ్‌మెడల్ అవార్డు

శ్రీ మంగి రాములు మహరాజ్‌కు లండన్ కేంద్రంగా నిర్వహిస్తున్న వండర్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధు లు గోల్డ్‌మెడల్ అవార్డును బహూకరించారు. 144 ఏళ్లకు ఓసారి వచ్చే మహాకుంభమేళాలో భక్తులకు 41 రోజుల పాటు అల్పాహారం అందజేశారు. ఈ ఏడు జనవరి 6 నుంచి ఫిబ్రవరి 14 వరకు కార్యక్రమం చేపట్టారు. దీంతో వండర్ బుక్ ఆఫ్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధులు గోల్డ్‌మెడల్‌తో సన్మానించారు.


లింగంపల్లి శివాలయంలో శివలింగం ఆకారంలో దీపాలు


సాలూర హనుమాన్ మందిరం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం


కందకుర్తిలో గోదావరి వద్ద భక్తుల స్నానాలు


యంచ విఠలేశ్వర ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు


బోధన్ శివాలయంలో లక్ష దీపోత్సవ కార్యక్రమం

క్రైం సమాచారం

మద్యానికి బానిసై ఆత్మహత్య

భిక్కనూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసై ఒకరు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలోని మల్లుపల్లిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్సై ఆంజనేయులు కథనం ప్రకారం.. గ్రామానికి గుండ్రెడ్డి నర్సింలు(40) జులాయిగా తిరుగుతూ కొన్నిరోజులుగా మద్యానికి బానిసయ్యాడు. మద్యానికి డబ్బులు లేక తన అత్తమ్మను అడిగినా.. ఇవ్వకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరేసుకున్నాడు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. నర్సింలు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి జిల్లా ఆస్పత్రికి తరలించారు.

అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

▸▸ డ్రైవర్ జాగ్రత్తతో తప్పిన ముప్పు

కోటగిరి,నవంబరు5(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండలం పీఎస్ఆర్ నగర్‌లో బుధవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు అదుపు తప్పింది. ఎదురుగా వచ్చే ధాన్యం లారీని తప్పించే క్రమంలో కల్వర్టును ఢీకొట్టి ఆగిపోయింది. బోధన్ నుంచి హంగ్సా మీదుగా సుంకినికి వెళ్తుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. బస్సులో సుమారు 40మంది ప్రయాణికులు ఉన్నారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో పెను ప్రమాదం తప్పింది. స్థానికులు స్పందించి జేసీబీ సాయంతో బస్సు బయటకు తీయించారు. ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోకపోవడంతో ప్రయాణికులు ఊపిరిపీల్చుకున్నారు.

కుక్క దాడిలో ముగ్గురికి గాయాలు

కోటగిరి,నవంబరు5(ఆంధ్రజ్యోతి): పోతంగల్ మండల కేంద్రంలో బుధవారం పిచ్చి కుక్క దాడిలో ముగ్గురు గాయపడ్డారు. పోతంగల్ గ్రామానికి చెందిన గంగారాం అనే వ్యక్తి సహకార సంఘంలో గన్నీ సంచులు తీసుకెళ్లే సమయంలో ఆయనపై కుక్క దాడి చేసి గాయపర్చింది. బస్టాండ్ సమీపంలో ఈనుస్ అనే వ్యక్తి కూరగాయలు కొనే సమయంలో వెనుక నుంచి వచ్చి కుక్క గాయపర్చింది. మరో మహిళపై కుక్క దాడి చేయగా స్థానికులు కుక్కను కర్రలతో దాడి చేసి కొట్టి చంపారు. గాయాలపాలైన బాధితులు ఆసుపత్రిలో చికిత్స పొందారు. గ్రామంలో కుక్కల బెడదను నివారించాలని గ్రామస్థులు కోరుతున్నారు. తమ పిల్లలను పాఠశాలకు పంపేందుకు తల్లిదండ్రులు సైతం భయపడే పరిస్థితి నెలకొంది. కుక్కలను నియంత్రించేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు

నవీపేట,నవంబరు5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఫత్తేనగర్, నాగేపూర్ గ్రామాల శివారుల మధ్యన గత నెల 24న శ్యామల లక్ష్మి అలియాస్ బుజ్జి(45) హత్యకు గురి కాగా నిందితులైన ముగ్గురిని బుధవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు నిజామాబాద్ ఏసీపీ రాజవెంకట్ రెడ్డి తెలిపారు. బుధవారం సాయంత్రం నిజామాబాద్‌లోని తన కార్యాలయంలో ఆయన వివరాలను వెల్లడించారు. మండలంలోని మద్దెపల్లికి చెందిన శ్యామల లక్ష్మికి ఫకీరాబాద్‌కు చెందిన గొల్ల సంగీత, కోస్లీకి చెందిన మంగళిబాబు, మద్దెపల్లికి చెందిన బదావత్ పద్మల మధ్యన పరిచయం ఉందన్నారు. ఇటీవల వీరి మధ్యన డబ్బుల గురించి గొడవలు జరుగుతున్నాయని, ఈ విషయంలో శ్యామల లక్ష్మిని చంపి వేయాలనే పథకాన్ని రచించారని ఆయన పేర్కొన్నారు. గత నెల 24న పథకం ప్రకారం శ్యామల లక్ష్మిని నిర్మానుష్య ప్రదేశంలో కల్లు తాగడానికి తీసుకుని వెళ్లారన్నారు. అనంతరం మద్యం మత్తులో ఉన్న శ్యామల లక్ష్మిని సంగీత, మిగత ఇద్దరి సహాయంతో గొంతు నులిమి హత్య చేయడంతో పాటు ముందుగానే తమ వెంట తెచ్చిన పెట్రోల్ పోసి తగలబెట్టారని ఏసీపీ వివరించారు. ఈ కేసులో నిందితులను పట్టుకోవడానికి కృషి చేసిన నిజామాబాద్ నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్‌ఐలు తిరుపతి, యాదగిరి గౌడ్, రాజశేఖర్, నవీపేట ఏఎస్‌ఐ గఫర్, క్రైమ్ టీం సభ్యుడు రాజేశ్వర్, నవీపేట పోలీస్ స్టేషన్‌కు చెందిన సిబ్బందిని ఏసీపీ అభినందించారు.

అశోక్.. ఆవిష్కరణలకు కేరాఫ్

▸▸ లివర్ క్యాన్సర్ నివారణలో నానో కంపోసిట్‌లపై పరిశోధన ▸▸ రెండు దేశాల్లో పేటెంట్స్ సాధించిన హసాకొత్తూర్ వాసి

కమ్మర్‌పల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని హసాకొత్తూర్ గ్రామానికి చెందిన బాస అశోక్‌కు లివర్ క్యాన్సర్ నివారణకు రూపొందించిన నానో కంపోసిట్‌లపై 2 దేశాల్లో పేటెంట్ హక్కులు లభించాయి. ఉస్మానియా యూనివర్శిటీలోని ఇంజినీరింగ్ కళాశాల ఫిజిక్స్ విభాగంలో అశోక్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నారు. ఓయూ వందేళ్ల చరిత్రలో ఎవరికీ పేటెంట్ హక్కులు దక్కలేదు. హసాకొత్తూర్‌కు చెందిన అశోక్ ఈ ఘనతను సాధించిన తొలివ్యక్తిగా గుర్తింపు పొందడంతో అంతటా ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. అశోక్ గతంలోనూ థాయిలాండ్ దేశంలో పేటెంట్ పొందగా.. తాజాగా భారతదేశంలోనూ హక్కులు సాధించడంతో ఉస్మానియా యూనివర్శిటీలోని వివిధ విభాగాల అధిపతులు, ప్రొఫెసర్లను అశోక్‌ను సన్మానించి అభినందించారు.


బాస అశోక్‌ను సన్మానిస్తున్న ఉస్మానియా యూనివర్శిటీ ప్రొఫెసర్లు

పరిశోధనలంటే ఆసక్తి..

అశోక్‌కు నూతన పరిశోధనలంటే ఆసక్తి. ఓయూలో ఎమ్మెస్సీ ఫిజిక్స్ చేసి అక్కడే పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రిపరేషన్ అండ్ క్యారెక్టరైజేషన్ ఆఫ్ సంపలీమార్ గ్రీన్ కంపోసైట్స్ యూసింగ్ బయోఫీలర్స్ అనే అంశంలో గౌరవ డాక్టరేట్ పట్టా పొందారు. దేశంలో కాలేయ క్యాన్సర్ ఎక్కువగా ఇబ్బందులకు గురిచేస్తుండడతో ఈ నేపథ్యంలో దానిని నివారించేందుకు అశోక్ నానో కంపోసిట్ టర్మరిక్ పౌడర్ విత్ ఇన్ ఎస్‌బిటీయూ జనరేటెడ్ మెటల్ నానో పార్టికల్స్ అనే అంశంపై పరిశోదనలు చేశారు. ఈ ప్రాజెక్ట్ ప్రధాన ఉద్దేశం లెబరైటరీ సెల్‌లైన్ స్టడీస్ ఇండికేటెడ్ ఇట్స్ ఏఫిసెన్స్ ఆఫ్ ఇంచిబీటింగ్, హైపోథిసీస్ ఆఫ్ హేపీజీ 2 క్యాన్సర్‌ఎల్‌స్‌ల్ అనే లివర్ క్యాన్సర్‌ను నివారించేందుకు ఎంతో ఉపయోగపడుతోందని అశోక్ తెలిపారు. ఈ అంశంపై ఇప్పటికే థాయిలాండ్ దేశంలో పేటెంట్ హక్కులు పొందానని, ఇప్పుడు మన దేశంలోనూ హక్కులు సాధించడం సంతోషంగా ఉందని అశోక్ పేర్కొన్నారు.

విద్యా వాలంటీర్‌గా పనిచేసి..

చిన్ననాటి నుంచి చదువు పట్ల ఆసక్తి కనబర్చే అశోక్ హసాకొత్తూర్ ఉన్నత పాఠశాలలో విద్యావాలంటీర్‌గా పిల్లలకు ఫిజిక్స్ పాఠాలు బోధించారు. ఉన్నత చదువులు చదివిన అశోక్ వివిధ అంశాలపై రాసిన ఆర్టికల్స్ అంతర్జాతీయ జర్నల్లల్లో ప్రచురణకు ఎంపికయ్యాయి. ఎందరో ఉన్నత విద్యావంతులు ఉన్నతశ్రేణి అధికారులు ఉన్నా ఈ గ్రామంలోనే జన్మించిన బాస అశోక్ అదే స్థాయిలో పరిశోధనలు చేస్తూ ప్రశంసలు అందుకోవడం పట్ల గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.


వర్నిలో పాలాభిషేకం చేస్తున్న దృశ్యం

బోనస్ చెల్లింపుపై హర్షం

వర్ని, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో బుధవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, వ్యవసాయ సలహాదారు పోచారం శ్రీనివాస్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రైతులు కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి నందుకు క్వింటాలుకు రూ.500 బోనస్ ఇచ్చినందుకు కాంగ్రెస్ శ్రేణులు రైతులు హర్షం వ్యక్తం చేశారు. కాంగ్రెస్‌ది రైతు ప్రభుత్వమని, రైతుల కోసం అన్ని పథకాలు అమలు చేస్తోందని వారు పేర్కొన్నారు. గత రబీ సీజన్ పంట బోనస్ కూడా ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ భాస్కర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ సురేష్‌బాబా, రాంజ్యా నాయక్, నేమాని వీర్రాజు, గిరి, విండో చైర్మన్ దశరథ్, సాయిబాబా పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఉమ్మడి జిల్లాల ఇంటెలిజెన్స్ డీఎస్పీ మధుసూదన్

నాయక్‌పోడ్‌లు అన్ని రంగాల్లో రాణించాలి

ఆర్మూర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆదివాసీ నాయక్‌పోడ్‌లు అన్ని రంగాల్లో రాణించాలని ఉమ్మడి జిల్లాల ఇంటెలిజెన్స్ డీఎస్పీ మధుసూదన్, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో సాయన్న పేర్కొన్నారు. ఆర్మూర్ మండలం చేపూర్‌లో బుధవారం మీనుగు పెద్ద రాజన్న స్మారక జిల్లాస్థాయి ఆదివాసీ నాయకపోడ్ కబడ్డీ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా హాజరైనవారు మాట్లాడారు. ఆదివాసీ నాయక్‌పోడ్ కులస్థులు ఐక్యంగా ఉండి, జిల్లాస్థాయిలో కబడ్డీ పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఆటలపోటీలు, సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకపోడ్ సంఘం జిల్లా అధ్యక్షుడు కులస్థులు గాండ్ల రాంచందర్, గౌరవ అధ్యక్షుడు బండారి బోజన్న, జిల్లా ఉద్యోగులు సంఘం అధ్యక్షుడు పుట్ట రాజేశ్వర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ జడ్పీటీసీ సాదన్న, మాజీ సర్పంచ్‌లు ఇందూరు సాయన్న, కస్తూపురం గంగారెడ్డి, సత్యనాయణ, మాజీ ఎంపీటీసీ జన్నెపల్లి గంగాధర్, నాగరాజు, గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా భీమన్న దేవుడి కల్యాణం..

ఆర్మూర్ మండలం చేపూర్‌లో బుధవారం ఆదివాసీ నాయక్‌పోడ్ సంఘం ఆధ్వర్యంలో భీమన్న దేవుడి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం ప్రత్యేక పూజలు, కల్యాణం నిర్వహించిన అనంతరం కులస్థులు అంతా తమ కుటుంబసభ్యులతో కలిసి అగ్నిగుండం దున్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకపోడ్ కులస్థులు, సంఘ సభ్యులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

రుద్రూరు,నవంబరు5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పద్మశాలి కమ్యూనిటీ హాల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 95మంది రోగులకు కంటి, దంత పరీక్షలు నిర్వహించారు. అలాగే లయన్స్ కంటి ఆసుపత్రి రాకాసిపేట్ వైద్యులు కంటి పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ ఇర్ఫాన్ అలీ దంత పరీక్షలు నిర్వహించారు. అవసరమైన రోగులకు కంటి చుక్కల మందులు, దంత సమస్యలు ఉన్న వారికి టూత్ పేస్టులు, మౌత్ వాష్‌లు, నొప్పుల మాత్రలు అందజేశారు. ఇందులో 12మంది రోగులకు ఉచిత కంటి ఆపరేషన్ నిమిత్తం లయన్స్ కంటి ఆసుపత్రికి పంపించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ రుద్రూర్ అధ్యక్షుడు లయన్ కేవీ మోహన్, కార్యదర్శి గుండూరు ప్రశాంత్ గౌడ్, కోశాధికారి ఇమ్రాన్, శ్యామ్ సుందర్ పహాడే, ప్రవీణ్ కుమార్, పార్వతి ప్రశాంత్, గాండ్ల మధు, లింగం, క్యాంప్ ఇన్‌చార్జి హన్మంత్‌రావు తదితరులు పాల్గొన్నారు.


పరీక్షలు చేస్తున్న వైద్యసిబ్బంది, పాల్గొన్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు

రాష్ట్రస్థాయికి ఇందూరు బిడ్డలు

కమ్మర్‌పల్లి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హసాకొత్తూర్ ఉన్నత పాఠశాలకు చెందిన ప్రతిభ, ఆశ్రిత అనే విద్యార్థినులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయురాలు అరుణశ్రీ తెలిపారు. జిల్లా స్థాయిలో జరిగిన పోటీల్లో అసమాన క్రీడాప్రతిభను కనబర్చిన ఈ విద్యార్థినులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు వివరించారు. ఈ నెల 7 నుంచి మూడు రోజులపాటు సంగారెడ్డి జిల్లాలో నిర్వహించనున్న పోటీల్లో జిల్లా జట్టు తరపున వీరు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. విద్యార్థినులు, వారికి శిక్షణ ఇచ్చిన వ్యాయమ ఉపాధ్యాయురాలు మాధురిని ప్రధానోపాధ్యాయురాలు అరుణశ్రీ, ఉపాధ్యాయులు అభినందించారు.


రాష్ట్రస్థాయికి ఎంపికైన ప్రతిభ, ఆశ్రిత

యాత్రికులకు సన్మానం

రుద్రూర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్రా యాత్రకు వెళ్తున్న మాజీ ఎంపీటీసీ హబీబ్ ఖాన్, ఆయన కుమారుడు పఠాన్ అఫ్రోజ్ ఖాన్ వారి కుటుంబ సభ్యులను బుధవారం ముస్లిం మైనారిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అక్బర్‌నగర్‌లో వారి స్వగృహంలో కలిశారు. యాత్రికులు ఆరోగ్యంగా, భద్రంగా ప్రయాణించి పవిత్ర మక్కా మదీన ప్రాంతంలో దర్శనంగా చేసుకుని తిరిగి సంతోషంగా స్వస్థలాలకు రావాలని కోరారు. కార్యక్రమంలో ముస్లిం మైనారిటీ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు లాల్ మహమ్మద్, ఉపాధ్యక్షులు సయ్యద్ సికెందర్ ఖాద్రీ, మహమ్మద్ జావీద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

పోరాటానికి సిద్ధం కావాలి

కమ్మర్‌పల్లి, నవంబరు 5: (ఆంధ్రజ్యోతి) మండలంలోని చౌట్‌పల్లికి చెందిన బీడీకార్మికులను దేశాయిబీడీ కంపెనీ నిలవుదోపిడి చేస్తుందని, ఈ విషయమై ఐక్యపోరాటానికి కార్మికులంతా సిద్ధం కావాలని ప్రగతిశీల బీడీ వర్కర్ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురా లు సత్తెక్క పిలుపునిచ్చారు. బుధవారం అందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను మహిళ కార్మికులతో కలిసి ఆవిష్కరించారు. బీడీకార్మికులు పోసాని, మమత, పాల్గొన్నారు.

పీఆర్‌టీయూ మండల ప్రధానకార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి

రెంజల్, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): రెంజల్ మండల పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శిగా కే. శ్రీనివాస్ రెడ్డి నియామకం అయ్యారు. బుధవారం జిల్లా పీఆర్‌టీయూ కార్యాలయంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మోహన్ రెడ్డి, కిషన్‌లు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఉపాధ్యాయులు, పీఆర్‌టీయూ నాయకులకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల సమస్యలపై నిరంతరం కృషి చేస్తానని అన్నారు. పీఆర్‌టీయూ రెంజల్ మండల అధ్యక్షులు సోమలింగం గౌడ్, మాజీ ప్రధాన కార్యదర్శి కిషోర్ కుమార్, సునీల్, కృష్ణ, నాందేవ్, కృష్ణ, రఫీక్, తాహెర్ తదితరులున్నారు.

మద్యం దుకాణం తొలగించాలి

▸▸ ఎమ్మెల్యేకు వినాయక్‌నగర్ వాసుల వినతి

కోటగిరి, నవంబరు5 (ఆంధ్రజ్యోతి): కోటగిరి మండల కేంద్రంలోని ఎత్తొండ రోడ్‌లో ఉన్న వైన్స్‌ను తొలగించాలని వినాయక్‌నగర్ వాసులు కోరారు. ఈ మేరకు బుధవారం బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కాలనీలో వైన్స్ ఉండడంతో తరచూ ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని వాపోయారు. ఈ విషయమై ఎక్సైజ్ శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదన్నారు. స్పందించిన ఎమ్మెల్యే ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని కోరారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో కాలనీవాసులు సిరాజ్, వీరేశం, సాయిలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు సమస్య వివరిస్తున్న కాలనీవాసులు



లబ్దిదారులకు చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే పోచారం

డబుల్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

బాన్సువాడటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పోచారం నివాసంలో బుధవారం డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్దిదారులకు ప్రభుత్వ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి చెక్కులను అందజేశారు. బాన్సువాడ గ్రామీణం, నసురుల్లాబాద్, బీర్కూర్ మండలాలకు చెందిన లబ్దిదారులకు 4 కోట్ల రూపాయల చెక్కులను ఆయన అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, లబ్దిదారులు తదితరులున్నారు.

సుదర్శన్‌రెడ్డిని కలిసిన డీసీసీబీ మాజీ చైర్మన్



ప్రభుత్వ ముఖ్య సలహాదారు సుదర్శన్‌రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

బాన్సువాడటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని బుధవారం ఉమ్మడి నిజామాబాద్ డీసీసీబీ మాజీ చైర్మెన్ పోచారం భాస్కర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి, పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

బాన్సువాడలో జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్

బాన్సువాడటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ నెల 10న ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహించనున్నామని మాజీ మున్సిపల్ చైర్మెన్ జంగం గంగాధర్ తెలిపారు. అదేవిధంగా క్రీడాకారుల ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నామని ఆసక్తి గల క్రీడాకారులు పీడీ సురేందర్‌ను (99083 70837) సంప్రదించాల్సిందిగా కోరారు.

ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి పోటీలకు పిట్లం విద్యార్థి



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థి గణేష్

పిట్లం, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి పోటీ లకు జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల పిట్లం విద్యార్థి ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు సంజీవులు తెలిపారు. నేడు కామారెడ్డి జిల్లా పరిధిలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా కబడ్డీ సెలక్షన్‌లో అండర్ -17 కబడ్డీ బాలుర విభాగంలో పి.గణేష్ (10వ తరగతి) అత్యుత్తమ ప్రతిభ కనబరిచి భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏడూళ్ల బయ్యారంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయ్యారని వివరించారు. ఈ ఎంపిక పట్ల పాఠశాల హెచ్‌ఎం దేవిసింగ్, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.

పోలీసుల సేవలు భేష్



రోడ్డుపై గుంతల్లో మట్టిపోయిస్తున్న పోలీస్ సిబ్బంది

జుక్కల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కండేబల్లూర్ గ్రామం వద్ద వర్షాకాలం కురిసిన వర్షాలకు రహదారిపై గుంతలు ఏర్పడడంతో జుక్కల్ ఎస్సై నవీన్ చంద్ర ఆధ్వర్యంలో పోలీసులు టిప్పర్ల ద్వారా మట్టిని తరలించి గుంతలను పూడ్చారు. అనంతరం ఎస్సై నవీన్ చంద్ర మాట్లాడుతూ రహదారి పై వెళ్లే ప్రయాణికులకు ప్రమాదాలు నివారించడానికి గుంతలలో మట్టి నింపామని ఆయన అన్నారు. ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే వారు సురక్షితంగా ప్రయాణం చేసి గమ్యస్థానం చేరుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. జుక్కల్ పోలీస్ వారు స్వచ్ఛందంగా గుంతల్లో మట్టి నింపడంతో జుక్కల్ పోలీస్ సేవలు భేష్ అని గ్రామ పెద్దలు ప్రశంసించారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక పౌర్ణమి వేడుకలు



భైరాపూర్ విఠలేశ్వర ఆలయంలో దీపాలు వెలిగించి పూజలు చేస్తున్న దృశ్యం

బాన్సువాడ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజలు బుధవారం కార్తీక పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళలు ఉదయాన్నే ఇళ్లలో ప్రత్యేక పూజలు చేపట్టారు. అనంతరం కుటుంబ సభ్యులతో కలిసి తులసికోట, ఉసిరి చెట్టుకు కల్యాణ మహోత్సవం నిర్వహించారు. అనంతరం అందరూ కలిసి పంక్తి భోజనం చేశారు. అదేవిధంగా మహిళలు శివాలయాల్లో కార్తీక దీపాలను వెలిగించారు.

బీర్కూర్: మండల వ్యాప్తంగా కార్తీక పౌర్ణమి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని శివాలయాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఉసిరి చెట్టు కింద దీపారాధన చేసి, అరటి డొప్పలలో దీపాలు వెలిగించి మంజీరా నదిలో వదిలారు. భక్తులు దానధర్మాలు, నదీ స్నానాలు చేస్తూ పుణ్యం సంపాదించుకున్నారు. బీర్కూర్, భైరాపూర్ గ్రామాలలోని విఠలేశ్వర ఆలయాల్లో మహిళలు దీపాలు వెలిగించారు.

జుక్కల్: మండలంలో వివిధ గ్రామాల్లో బుధవారం తులసి వనాలకు ఇంటిలో మహిళలు కల్యాణం నిర్వహించారు. జుక్కల్ మండలం మహారాష్ట్ర కర్ణాటక సరిహద్దులో ఉండడంతో భక్తిభావం జుక్కల్ మండలంలో అధికంగా ఉంది. కర్ణాటక సాంప్రదాయం ప్రకారం ఇంటి ముందున్న తులసి మొక్కకు ప్రతీ సంవత్సరం కార్తీక పౌర్ణమి రోజు తులసి మొక్కకు కల్యాణం జరిపించారు.

పిట్లం: శివాలయాలలో మహిళలు బుధవారం కార్తీక పౌర్ణమి పురస్కరించుకుని దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. కార్తీక పౌర్ణమి కావడంతో శివాలయాలకు భక్తులు ఉదయం నాలుగు గంటల నుంచి ఆలయానికి చేరుకుని పూజలు చేసి సాయంత్రం వేళలో ఉసిరికాయ, పిండితో చేసిన దీపాలు వెలిగించారు.

తాండూర్ త్రిలింగేశ్వరాలయంలో

నాగిరెడ్డి పేట: కార్తీక పౌర్ణమి సందర్భంగా మండలంలోని తాండూర్‌లో గల అతి పురాతన ఆలయమైన త్రిలింగేశ్వర ఆలయంలో బుధవారం భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

తండ్రి, కుమార్తెల జ్ఞాపకార్థం

ఫరీద్‌పేటలో గ్రంథాలయం ప్రారంభం

- సుమారు రూ.20లక్షల సొంత నిధులతో భవన నిర్మాణం
- గ్రామానికి అంకితం చేసిన జీడిపల్లి లత-నర్సింహారెడ్డి ఆదర్శ దంపతులు



దాత నర్సింహారెడ్డి దంపతులను సన్మానిస్తున్న గ్రామస్థులు, అధికారులు

పాల్వంచ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రామంలో గ్రంథాలయం ఉంటే నిరుద్యోగ యువతకు, పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులకు ఉపయోగ పడుతుందని గ్రంథాలయ భవనం, పుస్తకాలు అందించాలనే దృఢసంకల్పం చేసి గ్రామానికి గ్రంథాలయం నిర్మించి గ్రామానికి అంకితం చేశారు మాచారెడ్డి మాజీ వైస్ ఎంపీపీ జీడిపల్లి నర్సింహారెడ్డి లత దంపతులు. పాల్వంచ మండలం ఫరీద్‌పేట గ్రామంలో అధిక సంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులతో పాటుగా ప్రైవేటు ఉద్యోగాల్లో సైతం చాలా మంది పని చేస్తున్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే విద్యార్థులు, పుస్తక పఠనం చేసే పెద్దవారికి గ్రంథాలయం అవసరం అనే విషయాన్ని గ్రామస్థులు నర్సింహారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. గ్రామస్థుల కోరిక మేరకు ఆయన గ్రంథాలయం నిర్మాణానికి గ్రామస్థులకు హామీ ఇచ్చి నిర్మాణానికి ముందడుగు వేశారు.

తండ్రి, కుమార్తె జ్ఞాపకార్థం..

జీడిపల్లి నర్సింహారెడ్డి తండ్రి మహబూబ్ రెడ్డి, కుమార్తె హారిక జ్ఞాపకార్థం ఫరీద్‌పేట గ్రామంలో గ్రంథాలయ నిర్మాణానికి ఆయన పూనుకున్నారు. సుమారు రూ.20 లక్షలు సొంత నిధులు వెచ్చించి అత్యాధునిక హంగులతో నిర్మాణాన్ని చేపట్టి ఇటీవల నిర్మాణాన్ని పూర్తి చేసి గ్రంథాలయానికి అవసరమయ్యే పుస్తకాలను సమకూర్చి బుధవారం గ్రామ పెద్దల సమక్షంలో ప్రారంభించి గ్రామానికి అంకితం చేశారు.

విజ్ఞానాన్ని పంచాలన్నదే మా ఉద్దేశం

గ్రంథాలయం గ్రామంలో ఉంటే ఎంతో మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించే అవకాశంక లుగుతుందని మాజీ వైస్ ఎంపీపీ జీడిపల్లి నర్సింహారెడ్డి అన్నారు. గ్రంథాలయం ప్రారంభించిన అనంతరం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ నిరుద్యోగులు, యువత ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఉన్నత శిఖరాలకు చేరి తల్లిదండ్రులకు, గ్రామానికి మంచి పేరును తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీపీ దంపతులను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్ర మంలో ప్రొఫెసర్ శంకర్, జిల్లా సైన్స్ అధికారి సిద్ధరాంరెడ్డి, రాష్ట్ర ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు వెంకటి, ఉపాధ్యాయులు ప్రవీణ్ నాయక్, కొండల్ రెడ్డి, రాంరెడ్డి, బాల్‌రాజు గౌడ్, రాజు, నర హరి, ఒట్టెంకి బాలరాజు, శివయ్య, ముత్యం, శ్రీనివాస్, శ్రీనివాస్‌రెడ్డి, రాజిరెడ్డి, శంకర్, స్వామి పాల్గొన్నారు.

ఉద్యోగ విరమణ పొందిన ఆర్మీ జవాన్‌కు ఘన సన్మానం

రెంజల్,నవంబరు5(ఆంధ్రజ్యోతి): రెంజల్ గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ పోతన్న అక్టోబర్ 31న పదవి విరమణ పొంది నేడు స్వగ్రామానికి తిరిగి రావడంతో గ్రామస్థులు ఘన స్వాగతం పలికి శాలువా, మెమోంటోతో ఘనంగా సన్మానించారు. ఆర్మీలో 21ఏళ్ల పాటు దేశానికి సేవ చేసి పదవి విరమణ పొంది గ్రామానికి తిరిగి రావడంతో గ్రామస్థులు ఘన స్వాగతం పలికారు. పోతన్న దంపతులను సన్మానించారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

నవీపేట,నవంబరు5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం వరి పంటకు క్వింటాకు 500రూపాయల చొప్పున బోనస్ చెల్లించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావు, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలలో ఇచ్చిన హామీ మేరకు రైతులకు క్వింటాలుకు 500రూపాయల చొప్పున బోనస్ చెల్లించడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో భగవాన్, మోస్రా సాయిరెడ్డి, గంగాధర్, నవీన్ రాజ్, సంజీవ రెడ్డి, మోహన్, వసంత్, ముస్తాక్, జబీర్, మూసా పాల్గొన్నారు.

అమరవీరుల సంస్మరణ సభ

రుద్రూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): నవంబరు 1 నుంచి 7వరకు అమరవీరుల సంస్మరణ సభలు జరపాలని పార్టీ పిలుపు మేరకు రుద్రూర్ మండలంలోని రాణంపల్లి గ్రామంలో బుధవారం సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథా) ఆధ్వర్యంలో అమరవీరుల సంస్మరణ సభ నిర్వహించారు. ఈ సంస్మరణ సభకు బుజ్జి స్వామి అధ్యక్షతన వహించారు. అమరవీరులకు రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు.

పంచ సూత్రాల ఏర్పాటుపై సభ్యులకు శిక్షణ

మద్నూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : మండల సమాఖ్య ఆధ్వర్యంలో ఆయా గ్రామాల గ్రామ సంఘం అధ్యక్షులకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శిక్షణ కార్యక్రమానికి ఓరుగల్లు మహాసమాఖ్య నుంచి వచ్చిన సీనియర్ కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లు అనురాధ, శ్రీలతలు పాల్గొని మహిళలకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వ హించారు. శిక్షణలో భాగంగా సంఘాలకు పంచ సూత్రాలు ఏర్పాటు, కట్టుబాట్లు, సంఘం లీడర్ల విధులు బాధ్యతలు, పుస్తక నిర్వహణపై అవగాహన కల్పించారు. గ్రామ సంఘానికి సబ్ కమిటీలు ఏర్పాటు, గ్రామ సంఘం కార్యాలయ నిర్వహణ, గ్రామ సంఘం పాలకవర్గం విధులు బాధ్యతలు, ఆడిట్‌పై వివరంగా శిక్షణ ఇవ్వడం జరిగింది. ఈ శిక్షణా కార్యక్రమంలో ఆయా గ్రామ సంఘాల గ్రామ సంఘం అధ్యక్షుడు మండల సమాఖ్య పాలకవర్గం రేణుక, లక్ష్మి, సవిత, ఏపీఎం కే.జగదీష్ కుమార్, మండల సమాఖ్య అకౌంటెంట్ నర్సింగ్ రెడ్డి, సీసీలు సంగీత, అనిల్, రాజశ్రీ, సుమిత్ర బాబన్ సింగ్ పాల్గొన్నారు.



బాన్సువాడలో పొగమంచు దృశ్యం

కమ్మేసిన పొగమంచు

బాన్సువాడ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ పట్టణం బుధవారం ఉదయం దట్టమైన పొగమంచుతో కమ్ముకుపోయింది. పొగమంచు కారణంగా రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు తలెత్తాయి. దాదాపు అరగంట తర్వాత సూర్యుడు మబ్బుతెరను చీల్చి బయటకు రావడంతో పొగమంచు మాయమైపోయింది.

జిల్లా స్థాయి ఎస్జీఎఫ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



జిల్లా స్థాయి ఎస్జీఎఫ్ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

పెద్దకొడప్‌గల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 4న ఎల్లారెడ్డి మండలం మాచాపూర్ పాఠశాలలో నిర్వహించిన ఉమ్మడి నిజామాబాద్ జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ పోటీల్లో మండలంలోని వడ్లం పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు పాఠశాల పీడీ ధర్మేందర్ తెలిపారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు వివిధ అంశాలలో పోటీ పడగా అందులో నుంచి తమ విద్యార్థులకు 5 గోల్డ్ మెడల్, 1 సిల్వర్ మెడల్, 2 కాంస్యం పథకాలు సాధించినట్లు పీడీ తెలిపారు.

ముగిసిన కార్తీక మాసం ప్రభాత్ భేరి



మద్నూర్‌లో శంఖానాదం చేస్తున్న అర్చకులు

మద్నూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో నెలరోజులుగా కొనసాగుతున్న ప్రభాత్ భేరి కార్యక్రమం బుధవారంతో ముగిసింది. పరమ పవిత్రం పావన మాసం కార్తీకం, శివకేశవులిద్దరికీ ప్రీతికరమైన మాసం, ఆధ్యాత్మిక కార్యక్రమాలకు శుభకార్యాలకు ఈ మాసం అనువైనది. ఈ మాసంలోనే మద్నూర్ మండల కేంద్రంలో అనాదిగా నడుస్తున్న ప్రభాత్ భేరి కార్యక్రమం ప్రత్యేకం. నెల రోజులుగా కొనసాగుతుంది. బుధవారం కార్తీక పౌర్ణమితో ప్రభాత్ భేరి కార్యక్రమం ముగిసినట్లు అర్చకులు తెలిపారు. గ్రామంలో శంఖానాదంతో తెల్లవారుజామున భక్తులు గ్రామాల్లోని దేవాలయాలకు చేరుకొని ప్రత్యేక పూజలు చేశారు. భారతీయ ఆధ్యాత్మిక సంప్రదాయాల్లో కార్తీకమాసం అత్యంత పవిత్రతను సంతరించుకుంది. ఈ పవిత్ర నెలలో మద్నూర్ గ్రామంలో కొనసాగుతున్న ప్రభాత్ భేరి భక్తుల మనసుల్లో భగవన్నామ దీపాన్ని వెలిగిస్తూ, ప్రతీరోజు తెల్లవారు జామున పుణ్య స్నానాలు చేసుకొని ఈ ఆధ్యాత్మిక యాత్రలో గ్రామస్థులు పాల్గొన్నారు. దీంతో గ్రామంలో భగవంతుని భక్తిని, ఏకతను ప్రతిబింబిస్తూ అద్భుత దైవానుభూతిని అందించిందని ప్రభాత్ భేరి పాల్గొన్న భక్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. భగవంతుని నామస్మరణతో నామస్మరణతో, హరిదాసుల భావపూర్వక భక్తి గీతాలతో, మృదంగ నాదంతో ముందుకు సాగే ఈ యాత్రలో, చిన్నలు, పెద్దలు పాల్గొంటూ మన సంస్కృతి జీవన శైలి ఎలా ఉండాలో చూపించారు. గల్లీ గల్లీ తిరుగుతూ, ప్రతీ ఇంటి ముందు దీపం వెలిగించి మంగళ హారతులు ఇస్తూ భక్తులు ఆత్మీయతతో భక్తులకు స్వాగతం పలికారు. వారిని స్వాగతించడం గ్రామ సమైకృతకు నిదర్శనం. సంస్కృతి - ఆరోగ్యం - ఆధ్యాత్మికతను కలిపే పవిత్ర పథం ప్రభాత్ భేరి కేవలం భజనల ప్రదర్శన కాదు, ఇది శరీరానికి ఆరోగ్యం, మనసుకు శాంతి, సమాజానికి ఐక్యత, తరతరాలకు సంస్కార బోధ, అనే నాలుగు మూలాధారాలకు ప్రతీకగా నిలుస్తోంది. ప్రకృతి మాధుర్యంతో కూడిన ఉదయ కాంతి మధ్య చర్చలు గ్రామం అంతా తిరగడం ద్వారా శరీర వ్యాయామం, గాలి-నీటి మార్పు వల్ల ఆరోగ్య ప్రయోజనాలు, దైవ నామస్మరణ వల్ల మానసిక ప్రశాంతత, కలిసి నడవడం వల్ల స్నేహం, ప్రేమ, సామాజిక సౌభ్రాతృత్వం పెరుగుతున్నాయని గ్రామస్థులు అభిప్రాయ పడుతున్నారు.

పశువులకు గాలికుంటు టీకాలు

పెద్దకొడప్‌గల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటేపల్లి గ్రామంలో బుధవారం పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పశు వైద్య సిబ్బంది మాట్లాడుతూ పశువులకు ఆయా రకాల వ్యాధులు రాకుండా ఉండేందుకు గాను పశువులకు గాలికుంటు టీకాలతో పాటు ఇతర మందులు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది శ్రీనివాస్, గోపాల మిత్ర రవీందర్ తదితరులు పాల్గొన్నారు.



పశువులకు టీకాలు వేస్తున్న దృశ్యం



బాన్సువాడ పట్టణంలోని కల్కి చెరువులో అరుణోదయ భానుడి ప్రతిబింబం

చెరువులో ఆకాశ ప్రతిబింబం

బాన్సువాడ టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : చల్లని వేకువజామున బాన్సువాడ పట్టణంలో ఓ అద్భుతం ఆవిష్కృతమైంది. చెరువు నీరు అద్దంలా దర్శనమిచ్చింది. దట్టపొగమంచు చెరువును కప్పి ఉంచగా అప్పుడపుడే ప్రకాశిస్తున్న అరుణోదయ భానుడు చెరువులో ప్రతిబింబించిన దృశ్యం చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. ఈ దృశ్యాన్ని ఆంధ్రజ్యోతి తన కెమెరాతో క్లిక్ మనిపించింది.



ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని సన్మానిస్తున్న కురుమ కులస్థులు

బీరప్ప ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయింపు

బీర్కూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుని బీర్కూర్ మండల కేంద్రంలో బీరప్ప ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయింపచేశారు. ఇదిలా ఉండగా బీర్కూర్ మండల కేంద్రానికి చెందిన కురుమ సంఘం సభ్యులు మంగళవారం రాష్ట్ర వ్యవసాయ శాఖ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కుల సంఘం సభ్యులు మాట్లాడుతూ బీర్కూర్ మండల కేంద్రంలో బీరప్ప ఆలయం పంట పొలాల్లో ఉందని, పండగ సమయంలో ఆలయానికి వెళ్లే దారి కూడా సరిగ్గా లేదన్నారు. ఇదే విషయాన్ని ఎమ్మెల్యేకు తెలిపి గ్రామంలో ఆలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని కోరామన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని స్థలం కేటాయింప చేశారన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యేను కలిసి కృతజ్ఞతలు తెలిపారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కురుమ సంఘం సభ్యులు బీరుగొండ, బీరప్ప, పోశిగొండ, గంగాధర్, గంగారం, భూమయ్య, వీరుగొండ, హన్మగొండ, నగేష్, పోశిగొండ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న ఆలయ నూతన కమిటీ సభ్యులు

బాన్సువాడటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాన్సువాడ అయ్యప్ప ఆలయ నూతన కమిటీ సభ్యులు బుధవారం ప్రమాణస్వీకారం చేశారు. నూతన అధ్యక్షుడిగా అర్సపల్లి సాయిరెడ్డి, ఉపాధ్యక్షులుగా శంకర్‌గౌడ్, మోహన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సిద్దిమహేశ్, సహాయ కార్యదర్శులుగా ప్రభాకర్‌చారి, మట్ట సాయిలు, కోశాధికారిగా ధనగారి కృష్ణారెడ్డిలతో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అయ్యప్ప ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక గురుస్వామి బెజుగం శంకర్ తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ వ్రతాలు



సలాబత్పూర్ ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో పాల్గొన్న దంపతులు

మద్నూర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సలా బత్పూర్ ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం సామూహిక సత్యనారాయణ వ్రతాలను నిర్వహించారు. ప్రతీ ఏడాది కార్తీక మాసంలో భాగంగా దంపతులకు సామూహికంగా సత్యనారాయణ వ్రతాలను ఆలయం తరఫున నిర్వహిస్తారు. ఆనవా యితీగా వస్తున్న ఈ కార్యక్రమం యథావిధిగా బుధవారం ఆలయంలో భక్తిశ్రద్ధలతో జరిగింది. 201 మంది దంపతులు సామూహిక సత్యనారాయణ వ్రతాలతో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు దంపతులు చేత సత్యనారాయణ వ్రతాన్ని నిర్వహింపజేశారు. అనంతరం వచ్చిన భక్తులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

మందగించిన ధాన్యం కొనుగోళ్లు



ధాన్యాన్ని లారీలో ఎత్తుతున్న హమాలీలు

పెద్దకొడప్‌గల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్‌లో రైతన్నలు పండించిన వరి ధాన్యం చేతికి వచ్చింది. దీంతో రైతులు పండించిన పంటను కొనుగోలు చేసేందుకు గాను ప్రభుత్వం సహకార సంఘాలు, ఐకేపీ కేంద్రాల ద్వారా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. సంబంధిత అధికారులు కూడా పంటను కొనుగోలు చేసేందుకు అన్ని విధాలుగా సిద్ధం చేశారు. అయితే రైతులు పంటను నూర్పిడి చేసిన నాటి నుంచి ప్రతీ రోజు వర్షం పడటంతో పంట ఎండకుండ పోయింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండ ఉండి ఆ తర్వాత వాతావరణం మారి ఒక్కసారిగా వర్షం కురియడంతో ధాన్యం నానిపోతుంది. అంతేకాక ఆకాశంలో మబ్బులతో ఎండ లేకుండ వాతావరణం చల్లగా ఉండటంతో వరి ధాన్యం ఎండటం లేదు. దీంతో తేమ శాతం రాక పోవడంతో ఆయా గ్రామాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం సేకరణ ప్రక్రియ మందగించింది. తేమ శాతం సరిగ్గా రాకపోవడంతో సహకార సిబ్బంది గాని, ఐకేపీ సిబ్బంది గాని ధాన్యంను కాంటాలు చేయడం లేదు. తేమ శాతం సరిగ్గా లేకుండా ధాన్యం కాంటా చేస్తే మిల్లర్లు తిరిగి ఆ ధాన్యం తిప్పి పంపుతారని ముందు జాగ్రత్తగానే ధాన్యం ఎండిన తర్వాత తేమ శాతం వస్తేనే కాంటాలు జోరుగా సాగుతాయని రైతులు చర్చించుకుంటున్నారు.

బస్ డ్రైవర్లకు శిక్షణ శిబిరం

సుభాష్‌నగర్, నవంబరు 5, (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రిక్ బస్ డ్రైవర్లు రోడ్డు భద్రతా నిబంధనలు పాటిస్తూ బస్సులను నడపాలని నిజామాబాద్ ప్రాంతీయ అధికారి జోత్స్న అన్నారు. జిల్లాకేంద్రంలోని ఆర్‌ఎం కార్యాలయ సమావేశ మందిరంలో జేబీఎం ఎలక్ట్రిక్ బస్ డ్రైవర్‌లకు బుధవారం శిక్షణ శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇటీవల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, వాటిని నివారించడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బస్సు నడిపేటప్పుడు మొబైల్ ఫోన్‌లు వాడొద్దని తెలిపారు. అతివేగంతో బస్సును నడపడం వల్ల ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. ఏకాగ్రతతో బస్సును నడిపి ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ డివిజనల్ మేనేజర్ మధుసూదన్, నిజామాబాద్ డిపో-2 మేనేజర్ సాయన్న, తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన్ రెడ్డికి సన్మానం



సుదర్శన్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం

బాన్సువాడ రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా ఇటీవల నియమితులైన బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డిని ఆయన నివాసంలో బుధవారం టీపీసీసీ డెలిగేట్ వెంకట్రాంరెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతానికి తనవంతు కృషి ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో తీసుకెళ్లే విధంగా ప్రతిఒక్కరూ కృషిచేయాలన్నారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఇందూరు శేఖర్, ఇతర నాయకులు ఉన్నారు.

కార్యకర్తకు పరామర్శ



నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే

భిక్కనూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లుపల్లి బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు, సీనియర్ నాయకుడు దోమకొండ సిద్దారెడ్డి తండ్రి ఇటీవల మరణించారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ బుధవారం సిద్దారెడ్డిని పరామర్శించారు. మృతుడి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో రామేశ్వర్‌పల్లి విండో చైర్మన్ భూంరెడ్డి, నాయకులు అత్తెల్లి శ్రీనివాస్, సాయిరెడ్డి, సాయాగౌడ్, రాజలింగం, చిన్న నర్సారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పాల్వంచ: మండలంలోని వాడి గ్రామంలో బీఆర్ఎస్ కార్యకర్త ఇమ్మడి రవి తల్లి ఇటీవల మరణించారు. ఈ మేరకు రవి కుటుంబాన్ని బుధవారం మాజీ ఎమ్మెల్యే గంపగోవర్ధన్ పరామర్శించారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ రాంరెడ్డి, మండల అధ్యక్షుడు రాజాగౌడ్, ప్రేమ్‌కుమార్, సాయిరెడ్డి, కూచని శేఖర్, శ్రీనివాస్‌గౌడ్, అనీల్, బాల్‌రాజు, తదితరులు ఉన్నారు.

బస్సు ఎక్కే వరకు ముక్కు మూయాల్సిందే



పైప్‌లైన్ లీకేజీతో నిలిచిన మురుగునీరు

- చౌరస్తాలో ప్రయాణ ప్రాంగణం కరువు
- సర్వీస్‌రోడ్డులో భారీ గుంతలు
- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు

సదాశివనగర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పద్మాజీవాడి చౌరస్తాలో సర్వీసు రోడ్డు అధ్వానంగా మారి కంపుకొడుతుంది. రోడ్డు పైనే మురుగు నిల్వఉండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దీనికి తోడు ఆ ప్రాంతంలో బస్టాండ్ లేకపోవడంతో బస్సు కోసం ముక్కుమూసుకొని వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. చౌరస్తా సమస్యల వలయంలో ఉన్నప్పటికీ సంబంధిత అధికారులు స్పందించక పోవడం దురదృష్టకరమని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. జాతీయ రహదారిపై వంతెన నిర్మించి ఏడాది గడుస్తున్నా సర్వీసు రోడ్డులో ప్రయాణికుల సౌకర్యార్థం బస్టాండ్ ఏర్పాటు చేయకపోవడంతో ప్రయాణికులు ఎండకు, వానకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్సుల కోసం రోడ్డుపైనే నిరీక్షిస్తున్నారు.

రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు

బ్రిడ్జి ప్రాంతంలో ఉన్న మిషన్ భగీరథ పైప్‌లైన్లకు సర్వీస్ రోడ్డులో లీకేజీలు ఏర్పడి నీరు వృథా అవడమే కాకుండా రోడ్డుపై పెద్దపెద్ద గుంతలు ఏర్పడ్డాయి. దీంతో ప్రధానంగా ద్విచక్రవాహనదారులు ప్రమాదాల కు గురవుతున్నప్పటికీ అధికారులు గుంతలను సరిచేయకపోవడం బాధాకరమని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పద్మాజీవాడి నుంచి వంతెన కిందగా బాన్సువాడ వెళ్లేందుకు డివైడర్ అడ్డంగా ఉంది. అయితే దానిని తొలగించకపోవడంతో వాహనదారులు యూటర్న్ చేసుకోవడానికి తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం తెలిసి కూడా అధికారులు పట్టించుకోకపోవడం ఆశ్చర్యకరంగా ఉందని గ్రామస్థులు, వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఇకనైనా స్పందించండి

ఇప్పటికైనా జాతీయరహదారి అధికారులు స్పందించి ప్రయాణీకులకు బస్ షెల్టర్ నిర్మించి నీటి లీకేజీలు సరిచేసి ఏర్పడ్డ గుంతలను పూడ్చాలని కోరుతున్నారు. రోడ్డుపై మురుగు నీరు నిలువ కుండా చూడాలని, బాన్సువాడ రోడ్డులో బ్రిడ్జి సమీపంలో ఉన్న డివైడర్‌ను తొలగించి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని స్థానికులు, వాహనదారులు కోరుతున్నారు.



బస్టాండ్ లేక రోడ్డుపై వేచిఉన్న ప్రయాణికులు

వైభవంగా సిద్దుల గుట్ట జాతర

తాడ్వాయి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధి చెందిన సిద్దులగుట్ట 34వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం కార్తీకపౌర్ణమి వేళ జాతర కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకకు వివిధ మండలాలనుంచే కాక జిల్లాల నుంచి భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేశారు. ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్ శబరిమాత ఆశ్రమాన్ని, సిద్దుల గుట్టను దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సిద్దులగుట్ట అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే పైడి ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జాతరను నిర్వహించారు. ఆయన వెంట కాంగ్రెస్ మండలాధ్యక్షుడు జూకంటి వెంకట్ రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాజిరెడ్డి, నాయకులు శ్యామ్‌రావు, మహేందర్ రెడ్డి, చౌకత్ అలీ, మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

● తాడ్వాయి మండల కేంద్రంలోని శ్రీ శబరిమాత ఆశ్రమంలో బీజేపీ ఎమ్మెల్సీ దంపతులు గోదావరి అంజిరెడ్డి ఆశ్రమంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చిన ఎమ్మెల్సీ అంజిరెడ్డికి మండల బీజేపీ నాయకులు శబరీమాత ఆశ్రమట్రస్టు ఆధ్వర్యంలో సన్మానించారు. అనంతరం సిద్దులగుట్ట జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పైడి ఎల్లారెడ్డి ఆధ్వర్యంలో సిద్దుల గుట్ట వద్ద అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో పార్టీ జిల్లా అధ్యక్షుడు నీలం చిన్న రాజులు, రాష్ట్ర నాయకులు పైడి ఎల్లారెడ్డి, గంగారెడ్డి, బాపురెడ్డి, లింగారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్రావు, కార్యదర్శి హోటల్ శ్రీను, మండల అధ్యక్షుడు వెల్మ సంతోష్ రెడ్డి, మండల బిజెపి నాయకులు, గ్రామస్థులు తదితరులు ఉన్నారు.



శబరిమాత ఆశ్రమంలో పూజలు చేస్తున్న ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్



పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్సీ దంపతులు

నేడు బీసీ రిజర్వేషన్లపై మౌనదీక్ష



ఆర్‌అండ్‌బీ అతిథిగృహం వద్ద సమావేశమైన జేఏసీ నాయకులు

కామారెడ్డిటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల కోసం గురువారం అంబేద్కర్ విగ్రహాల ఎదుట బీసీ మౌనదీక్ష కార్యక్రమం చేపట్టనున్నట్లు జేఏసీ నాయకులు నీలనాగరాజు, కుంబాల లక్ష్మణ్‌యాదవ్ తెలిపారు. బుధవారం ఆర్‌అండ్‌బీ అతిథిగృహంలో సమావేశం నిర్వహించి కార్యక్రమ నిర్వహణపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ల అంశాన్ని 9వ షెడ్యూల్‌లో చట్టబద్దంగా చేర్చేవరకు పోరాటాలు ఆగవన్నారు. లేదంటే గ్రామస్థాయి నుంచి అన్ని కుల, ప్రజాసంఘాలని కలుపుకొని ఉద్యమిస్తామన్నారు. నాయకులు రాజు, సిద్దిరాములు, భూమన్న, వెంకట్‌గౌడ్, సుదర్శన్, లలిత, మల్లన్న, గణేష్‌నాయక్, సాయికృష్ణ, రాజయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

లింబాద్రి ఆలయంపై పట్టింపేది?



మాట్లాడుతున్న జాగృతి అధ్యక్షురాలు కవిత

భీమ్‌గల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పవిత్ర పుణ్యక్షేత్రమైన శ్రీ లింబాద్రి నరసింహుడు చాలా మహిమగల దేవుడని, అలాంటి దేవస్థానం అభివృద్ధికి నోచుకోలేకపోతోందని జాగృతి అధ్యక్షురాలు కవిత అన్నారు. బుధవారం పవిత్ర పుణ్యక్షేత్రమైన లింబాద్రిగుట్టపైగల శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో కీలకమైన కాంగ్రెస్ నాయకులు ఇక్కడి ప్రాంతానికి చెందినవారే ఉన్నారని అయినను అభివృద్ధి వైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. బాల్కొండ నియోజకవర్గంలో వాగులపై నిర్మించిన డ్యామ్‌లతో పంట నష్టం జరుగుతోందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ లక్ష్మీనరసింహస్వామి భక్తుడని గతంలో లింబాద్రి గుట్ట అభివృద్ధికి రూ.5 కోట్లు కేటాయించారని గుర్తు చేశారు. గుట్ట కింద పరిపాలన విభాగ కార్యాలయ నిర్మాణానికి 20 లక్షలు కేటాయించి ఆలయ అభివృద్ధిపై పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ దృష్టి పెట్టాలని కోరారు. ఇలాంటి విషయాలను ఇక్కడ ఉన్న ప్రతిపక్ష ఎమ్మెల్యే కూడా అధికార పార్టీ నాయకులను నిలదీయలేకపోతున్నారన్నారు.

మరుగుదొడ్ల నిర్మాణానికి భూమి పూజ



మరుగుదొడ్ల నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న చైర్మన్, అర్చకులు

మాచారెడ్డి, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మాచారెడ్డి మండలంలోని చుక్కాపూర్ లక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో మహిళల సౌకర్యార్థం మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకునేందుకు వీలుగా గదుల నిర్మాణాలకు బుధవారం ఆలయ కమిటీ చైర్మన్ కమలాకర్‌రెడ్డి భూమి పూజ చేశారు. అనంతరం మాట్లాడుతూ.. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే మహిళా భక్తులు మరుగుదొడ్లు, దుస్తులు మార్చుకొనుటకు గదులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దాతల సహకారంతో ఈ నిర్మాణాలు చేపడుతున్నామని తెలిపారు. ఆలయ అభివృద్ధికి దాతలు ముందుకు రావాలని కోరారు. ఈవో ప్రభు చంద్రం, జూనియర్ అసిస్టెంట్ సంతోష్ కుమార్, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో కామారెడ్డి నాయకుల ప్రచారం



జూబ్లీహిల్స్‌లో ప్రచారం చేస్తున్న కామారెడ్డి మునిసిపాలిటీ మాజీ చైర్‌పర్సన్ ఇందుప్రియ

కామారెడ్డిటౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో కామారెడ్డి మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం పార్టీ నాయకులతో కలిసి ప్రచారం నిర్వహించారు. వెంగాల్‌రావునగర్ డివిజన్‌లోని కళ్యాణ్‌నగర్, వికాస్‌నగర్‌లో విస్తృతంగా ప్రచారం చేపట్టారు. ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని కోరుతూ ఓట్లు అభ్యర్థించారు.

రామారెడ్డి: రాష్ట్ర రాజధాని హైదరాబాద్ జూబ్లీహిల్స్ ఎన్నికల్లో భాగంగా టోలీచౌక్‌లో ఆగ్రో చైర్మన్ కాసుల బాలరాజుతో కలిసి రామారెడ్డి మాజీ జడ్పీటీసీ నారెడ్డి మోహన్ రెడ్డి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు ప్రజాదరణ పొందాయని, గత పదేళ్ల బీఆర్ఎస్ దొరల పాలనకు చరమగీతం పాడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఏర్పరిచారని పేర్కొన్నారు. జూబ్లీహిల్స్‌లో 30వేల ఓట్ల మెజార్టీతో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నవీన్ యాదవ్ గెలుపు ఖాయమని దీమా వ్యక్తం చేశారు.

నేడు యోగా పోటీలు

సుభాష్‌నగర్, నవంబరు 5, (ఆంధ్రజ్యోతి): జిల్లా యోగా అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం యోగా పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రధాన కార్యదర్శి గంగాధర్ ప్రకటనలో తెలిపారు. జిల్లాకేంద్రంలోని శ్రద్ధానంద్ గంజ్‌లోని ఉమామహేశ్వరి ఫంక్షన్ హాల్‌లో ఈ పోటీలు ఉంటాయన్నారు. అండర్ 8-18 వరకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు జనన ధ్రువీకరణ పత్రం, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఉదయం 8.30 గంటలలోపు హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 8074982200, 7386908518 నెంబర్లను సంప్రదించాలన్నారు.

ఉబికివస్తున్న పాతాళగంగ

(5వ పేజీ తరువాయి)

భూగర్భజలాలు పైకి వచ్చాయి.

పెరగనున్న యాసంగి సాగు

భారీ వర్షాల కారణంగా జిల్లాలో భూగర్భ జలాల మట్టాలు పెరిగాయి. చెరువులు, కుంటలు, బావుల్లో నీరు అధికంగా ఉంది. ప్రస్తుతం వరి చివరి దశలో ఉంది. మిగితా మొక్కజొన్న, సోయా, పత్తి పంటలు కోతకు వచ్చాయి. యాసంగి ప్రణాళికను సైతం అధికారులు సిద్ధం చేశారు. ప్రాజెక్టుల్లో, చెరువుల్లో నీరు సమృద్ధిగా ఉండడంతో యాసంగిలో పంటల సాగు పెరిగే అవకాశం ఉంది. జిల్లావ్యాప్తంగా 4,04,575 ఎకరాల్లో వివిధ పంటలు సాగవుతాయని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందులో వరి 2,46,500 ఎకరాలు, మొక్కజొన్న 34,420 ఎకరాలు, శనగ 72,200 ఎకరాలు, జొన్న 38,500ల ఎకరాల్లో పంటలు సాగవుతాయని ప్రణాళికలు సిద్ధం చేశారు. కాగా జిల్లాలో అత్యధికంగా కామారెడ్డి మండలంలో భూగర్భజలాల మట్టం 9.92 మీటర్లు ఉండగా.. మిగతా మండలాల్లో ఈ కింది విధంగా ఉన్నాయి.

మండలాల వారీగా భూగర్భ జలాల మట్టం

మండలం	మీటర్లలో	మండలం	మీటర్లలో
లింగంపేట	0.18	నిజాంసాగర్	5.63
మహమ్మద్‌నగర్	1.88	భిక్కనూరు	6.2
నస్రుల్లాబాద్	2.02	ఎల్లారెడ్డి	6.41
పాల్వంచ	2.04	నాగిరెడ్డిపేట	6.68
జుక్కల్	2.05	పిట్లం	6.72
మద్నూర్	2.49	రాజంపేట	7.01
బాన్సువాడ	2.99	పెద్దకొడప్‌గల్	7.03
బీర్కూర్	3.13	గాంధారి	7.99
మాచారెడ్డి	3.65	దోమకొండ	8.95
సదాశివనగర్	4.01	తాడ్వాయి	9.36
రామారెడ్డి	4.37	డోంగ్లి	9.08
బిచ్కుంద	4.82		

ట్రాన్స్‌ఫార్మర్ పునరుద్ధరణ పనులు



ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగిస్తున్న విద్యుత్ సిబ్బంది

ఎల్లారెడ్డి రూరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఆజామాబాద్- వెల్లుట్ల ప్రధాన రహదారిపై మంగళవారం ఓ కారు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. ఈ ఘటనలో విద్యుత్ స్తంభం విరిగి దానికి ఉన్న తీగలు, సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్ కింద పడిపోయింది. వెంటనే స్పందించిన విద్యుత్ సిబ్బంది బుధవారం నూతన విద్యుత్‌స్తంభాన్ని ఏర్పాటుచేశారు. దానికి సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను బిగించి విద్యుత్ తీగలను సరిచేసి ఆయా గ్రామాల ప్రజలకు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. సమస్యను 24 గంటల లోపే పరిష్కరించి విద్యుత్‌ను పునరుద్ధరించిన లైన్‌మెన్‌లు కాశీరాం, రవికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఘనంగా వేణుగోపాల స్వామి రథయాత్ర



రథయాత్రలో పాల్గొన్న గ్రామస్థులు

దోమకొండ, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేణుగోపాల స్వామి దేవాలయంలో బుధవారం కార్తీకపౌర్ణమి సందర్భంగా రథయాత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతిఏడాది కార్తీకపౌర్ణమి సందర్భంగా ఈ రథయాత్రను ప్రజలందరితో కలిసి నిర్వహిస్తామని ఆలయ నిర్వహకులు తెలిపారు. వేణుగోపాల స్వామి కీర్తనలతో గ్రామ వీధుల గుండా శోభాయాత్ర సాగింది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

తేమ తగ్గాలంటే యంత్రం కావాల్సిందే



తడిసిన ధాన్యాన్ని కుప్పలు చేస్తున్న రైతు

- తేమ తగ్గించే యంత్రాలతో రైతులకు మేలు

బాన్సువాడ రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన పంటను కొనుగోలు కేంద్రాల వద్ద విక్రయానికి ఉంచగా వర్షానికి తడిసి ముద్దవడంతో అన్నదాతలు తీవ్రంగా నష్టపోతున్నారు. సంబంధిత అధికారులు మాత్రం రైతులకు భరోసా కల్పించడంలో విఫలమవుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొనుగోలు కేంద్రాల్లో తడిసిన ధాన్యం రాశులుగా పేరుకుపయి, తేమశాతం రాకపోవడంతో రోజుల తరబడి ధాన్యం విక్రయించేందుకు ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొంది. తేమశాతం ఎక్కువగా ఉండటంతో రైస్‌మిల్లుల నిర్వాహకులు కోత విధించడంతో నష్టాలు తప్పట్లేదు. ఐదు ఎకరాలకు సంబంధించిన ధాన్యాన్ని ఆరబెట్టేందుకు సుమారు రూ.6వేలు ఖర్చు వస్తుందని, అలాగే తరుగుపేరిట మరో రూ.3వేలు అదనంగా నష్టపోతున్నామని చెబుతున్నారు.

ఆరబెట్టే యంత్రాలను తీసుకురావాలి

రైతులు పండించిన ధాన్యాన్ని నష్టపోకుండా కొనుగోలు చేసేందుకు సహకరా సంఘాల ఆధ్వర్యంలో ధాన్యం ఆరబెట్టే యంత్రాలను తాత్కాలికంగా ఏర్పాటుచేస్తే రైతులకు పెద్ద ఊరట కలుగుతుంది. డ్రయ్యర్ యంత్రం ద్వారా 25 నుంచి 30 శాతం తేమ ఉన్న 5 టన్నుల ధాన్యాన్ని 2 గంటల్లో 17 శాతానికి తగ్గించవచ్చని రైతులు చెబుతున్నారు. ట్రాక్టర్ ఇంజిన్ సహాయంతో నడిచే ఈ యంత్రం ద్వారా ఒక్కో రైతు కనీసం 100 బస్తాల ధాన్యాన్ని ఆరబెట్టినప్పటికీ రోజుకు పది మంది రైతులు యంత్రాన్ని ఉపయోగించుకునే వీలు ఉంటుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇలా చేస్తే తడిసిన ధాన్యం పాడవకుండా రైతులకు నష్టాలు తగ్గుతాయని, సొసైటీల ద్వారా అందజేసే ధాన్యం ఆరబెట్టే యంత్రాలకు క్వింటాలుకు రూ.55 చొప్పున ఛార్జీలు వసూళ్లు చేసినా రైతుకు ఎటువంటి నష్టం ఉండదని అంటున్నారు. సొసైటీ పరిధిలోని గ్రామాల్లో రైతులకు సబ్సిడీపై ధాన్యం ఆరబెట్టే యంత్రాలను ప్రభుత్వం అందిస్తే రైతులకు మేలు జరుగుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రైతులను ఆదుకోవాలి

రైతులు ధాన్యం ఆరబెట్టేందుకు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సహకార సంఘాల ద్వారా ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసేందుకు ధాన్యం ఆరబెట్టే యంత్రాలను తీసుకొస్తే రైతులకు అకాల వర్షాల వల్ల ధాన్యం తడిసిన ఆరబెట్టేందుకు తీసుకువచ్చిన యంత్రాలతో భారం తగ్గుతుంది. వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు సమన్వయం చేసుకుని యంత్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి.

- సుధాకర్‌రెడ్డి, రైతు



మొలకెత్తిన వరిధాన్యం

10న రాష్ట్రవ్యాప్త ఆందోళనలు

నిజామాబాద్ కల్చరల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీసీలకు రాజకీయ, విద్య, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్ సాధనకై బహుజన లెఫ్ట్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 10వ తేదీన రాష్ట్ర వ్యాప్త ఆందోళన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు రాష్ట్ర అధ్యక్షుడు దండి వెంకట్ అన్నారు. 42 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆందోళనలు చేపడతున్నామన్నారు. ఇందులో బీసీ కులాలు పెద్ద సంఖ్యలో ఆందోళనలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అసెంబ్లీలో 42 శాతం బిల్లు ఆమోదించినప్పటికీ.. కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. రాబోయే శీతాకాల పార్లమెంట్ సమావేశంలో కేంద్ర ప్రభుత్వం బీసీలకు రిజర్వేషన్ అమలయ్యేలా చట్టం తేవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షురాలు లత, ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్, సభ్యులు రాధా పాల్గొన్నారు.

నూతన అధ్యక్షుడిగా సుభోద్

సుభాష్‌నగర్, నవంబ రు 5, (ఆంధ్రజ్యోతి): అఖిల భారత విద్యార్థి సమైఖ్య జిల్లా నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా సుభోద్, రఘురాం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జిల్లాకేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏ ఐఎస్ఎఫ్ 14వ మహాసభ ఉపాధ్యక్షుడు సుభో ద్ అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. ఈ మహాసభకు ముఖ్యఅతిథిగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు మణికంఠరెడ్డి హాజరయ్యారు. ఈ సభలో నిజామాబాద్ జిల్లా నూతన కమిటీని 23 మందితో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సుభోద్, ప్రధాన కార్యదర్శిగా రఘురామ్, ఉపాధ్యక్షులుగా అబ్దుల్, నవీన్, కృష్ణ, భార్గవి, శశికాం త్, సహాయ కార్యదర్శులుగా సంజయ్, కుశాల్, చోటు, అబ్దుల్, కోశాధికారిగా అనూషను ఎన్ను కున్నారు. ఈ నూతన కమిటీ 3 సంవత్సరాల పాటు విద్యారంగ సమస్యలపై పోరాడుతుందని, విద్య ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

జల్దిపల్లిలో వాటర్‌ప్లాంట్ ప్రారంభం



వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎల్లారెడ్డి

లింగంపేట, నవంబర్ 5 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డి నియోజకవర్గంలోని ప్రతి ఇంటికి మంచినీటిని అందించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడతానని బీజేపీ రాష్ట్ర నాయకుడు పైడి ఎల్లారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని జల్దిపల్లి గ్రామంలో ఎల్లారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఏర్పాటుచేసిన వాటర్‌ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. బాణాపూర్‌తండాలో హనుమాన్ ఆలయానికి కంపోండ్ వాల్‌నిర్మాణంతో పాటు దూపదీప నైవేద్యానికి రూ.80 వేలు అందజేశారు. బాణాపూర్‌లో పెద్దమ్మ ఆలయానికి ప్రవేశద్వారం నిర్మాణానికి రూ.1.20 లక్షలు అందజేస్తానని ఆయన తెలిపారు. కొర్పోల్‌లో తల్లిదండ్రులను కోల్పోయిన అర్చన, హర్షలకు ఆర్థికసాయం అందించారు. బీజేపీ మండలాధ్యక్షుడు క్రాంతికుమార్, జిల్లా కౌన్సిల్ సభ్యుడు రాంచందర్, రజనీకాంత్, ఎల్లారెడ్డి మండల అధ్యక్షుడు నర్సింలు, మోతె మల్లయ్య, రవి, గణేష్ పాల్గొన్నారు.

ఉద్యమాల దిక్సూచి జంపాల

సుభాష్‌నగర్, నవంబరు 5, (ఆంధ్రజ్యోతి): విద్యార్థి ఉద్యమాల దిక్సూచి జంపాల చంద్రశేఖర్‌ప్రసాద్ అని పీడీఎస్‌యూ తొలితరం నేత పాపయ్య అన్నారు. జంపాల చంద్రశేఖర్‌ప్రసాద్ 50వ వర్ధంతి సందర్భంగా జిల్లాకేంద్రంలోని బస్వాగార్డెన్ నుంచి వినాయక్‌నగర్‌లో గల అమరవీరుల స్థూపం వరకు పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో బుధవారం మార్నింగ్‌వాక్ నిర్వహించారు. ఈ సందర్భంగా పాపయ్య మాట్లాడుతూ.. జార్జిరెడ్డి మరణం తర్వాత జంపాల చంద్రశేఖర్ సంఘం నిర్మాణంలో కీలకపాత్ర పోషించాడన్నారు. విద్యార్థుల సమస్యలపై ప్రశ్నించే గొంతులు దేశంలో ఉండొద్దని ప్రసాద్‌ను ఎమర్జెన్సీ కాలంలో ఆనాటి ప్రభుత్వం హత్యచేసిందని ఆరోపించారు. ప్రసాద్ మహోన్నత త్యాగంతో పీడీఎస్‌యూ మరింత ఎర్రబడిందన్నారు. ఐదు దశాబ్దాలకు పైగా సంఘం అమరుల స్ఫూర్తితో ప్రగతిశీల ఆలోచనలతో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాడుతోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పిట్ల సరిత, సంగం పూర్వ నాయకులు భూమన్న, సత్యనారాయణ, సత్యం, రమేష్, వెంకన్న, రవి, మల్లికార్జున్, నథనేల్, ప్రస్తుత జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేశ్వర్, మనోజ్, సాయికిరణ్, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

మహాసభలను విజయవంతం చేయండి

మోపాల్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మూడవ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఐ జిల్లా నాయకుడు బొంబాయి గంగన్న అన్నారు. బుధవారం మండలంలోని ఠాణాకుర్దు గ్రామంలోని సీపీఐ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 6వ తేదీన మోపాల్ మండలం ఠాణాకుర్దు గ్రామంలో నిర్వహించే జిల్లా మహాసభలను కార్మికులు, కార్మిక సంఘ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో నాయకులు సాయగౌడ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్

కామారెడ్డి

ప్రియ 70- కె- ర్యాంప్
ప్రియ 35- కాంతార
దర్శన్- బిసన్ కలమందన్

బాన్సువాడ

మహేశ్వరి మాస్ జాతర
వెంకటేశ్వర బాహుబలి (ది ఎపిక్)

చికెన్ ధరలు

రకం	సుగుణ	వెన్‌కాబ్
లైవ్	రూ.140	రూ.170
స్కిన్	రూ.200	రూ.210
స్కిన్‌లెస్	రూ. 220	రూ.230